

**మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు**
రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ సత్తాచాటారు. మొత్తంగా 40 వరకు పతకాలు సాధించారు. 8లో ▸



**పెళ్లింట పెను విపత్తు**
నవ వధూవరులు సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతు కావడంతో గుర్వాయిపాలెం, జువ్వలపాలెంలో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. 8లో ▸



**బాధితులకు సత్వర న్యాయం**
స్పందనలో ఫిర్యాదులు, వినతులు సమర్పించిన బాధితులకు సత్వర న్యాయం అందిస్తామని ఏలూరు ఎస్పీ డి.మేరీప్రశాంతి తెలిపారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### మానవత్వం చాటుకున్న పీవీఎల్

**ఉండి:** డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చొరవతో వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డు ప్రమాద బాధితులకు వెన్నంటి ఉండి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నార్పీ అగ్రహారం పాల కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం జాతీయ రహదారిపై ఉండి వైపు వస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో రోడ్డు పక్కకు ఒరిగిపోగా ప్రయాణికులు ఆర్తనాదాలు చేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తనతో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, నాయకులు గలావిల్లి ధనుంజయ, ముస్సలూరి శ్రీనివాస్‌కు ఆదేశించడంతో ఆటోలో ఇరుక్కున ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. 108 సాయంతో వారిని చికిత్స నిమిత్తం భీమవరం తరలించారు.

### శిక్షలు తగ్గించడంపై అవగాహన



సదస్సుకు హాజరైన న్యాయవాదులు, పోలీసులు

**ఏలూరు (టూటౌన్):** ఏడేళ్లలోపు శిక్ష ఉన్న కేసుల్లో ఇరుపక్షాలను ఒప్పించి శిక్షలు తగ్గించే విధానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసులు, న్యాయవాదులపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్లీ బార్గెనింగ్ ద్వారా కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీడీబీటీ జూనియర్ కాలేజీలో మానవ హక్కుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పౌర స్వేచ్ఛా జీవితానికి ఆటంకం కలిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ శాశ్వత లోక్‌అదాలత్‌లో విద్య, వైద్యం,బ్యాంకింగ్, బీమా, రవాణా తదితర పది సేవలపై లోపం కలిగితే ఆశ్రయించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

### 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

**ఏలూరు(మెట్రో):** జిల్లాలో ఈనెల 15 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనే వారి రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారంలోపు పూర్తిచేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ (యువజన సర్వీసుల శాఖ) పీఎస్ ప్రద్యుమ్న ఆడుదాం ఆంధ్ర నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పోటీల్లో 15 ఏళ్లకు పైబడిన వారు పాల్గొనవచ్చని, మంగళవారం సాయంత్రంలోపు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

### ఆదాయం తగ్గిందేంటి స్వామీ!

**ద్వారకాతిరుమల:** ప్రొటోకాల్ విభాగం ద్వారా చినవెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులకు టిక్కెట్లను విక్రయించి ఆదాయం పెంచుతామన్న ఇంజనీరింగ్ విభాగ అధికారులు, సిబ్బందికి షాక్ తగిలింది. వీరు విధులు నిర్వర్తించిన రెండు శని, రెండు ఆదివారాల్లో వచ్చిన ఆదాయాన్ని, గతేడాది అదే నాలుగు రోజుల ఆదాయంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గింది. గతేడాది ఆయా రోజుల్లో రూ. 41,67,900 ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ. 41,36,500లు మాత్రమే వచ్చింది. ఈ లెక్కన ఈ ఏడాది రూ.31,400ల ఆదాయం తగ్గింది. ప్రొటోకాల్ విభాగాన్ని కట్టడి చేస్తే ఆదాయం బాగా పెరుగుతుందని భావించిన ఇంజనీరింగ్ విభాగ అధికారులు, సిబ్బందికి షాక్ తగిలినట్టు అయ్యింది. ఇదిలా ఉండగా ఆలయంలో ఉచిత ప్రసాద వితరణ జరిగే ప్రాంతంలో మంచినీటి కుళాయిలకు ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది నాలుగు రోజుల క్రితం డమ్మీలు వేశారు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

### పనులు వేగిరపర్చాలి

**భీమవరం(ప్రకాశం చౌక్):** ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను వేగవంతం చేయాలని అమరావతి నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ రేవు ముత్యాలరాజు, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆడుదాం ఆంధ్ర, రెవెన్యూ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, అధికారులు హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం సోమవారం వరకు 61 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని జేసీ వివరించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.దుర్గారావు, డిప్యూటీ తహసీల్దార్ ఈ.నాగార్జున పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల ఆధునికీకరణ

**ప్రగతి పరవళ్లు**
- రెండో దశ నాడు–నేడులో కొత్త సొబగులు
- 1,012 అంగన్‌వాడీ పాఠశాలల అభివృద్ధి
- రూ.9.15 కోట్ల నిధుల కేటాయింపు
- గిరిజన ప్రాంతంలో 135 సెంటర్లలో పనులు




బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెంలో అంగన్‌వాడీ పాఠశాల

**బుట్టాయగూడెం:** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల రూపురేఖలు మారనున్నాయి. నాడు–నేడు పథకం కింద అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారు. మనబడి–నాడు నేడు పథకంలో సర్కారీ బడుల్లో చేపట్టిన పనుల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించనున్నారు. జిల్లాలో 1,012 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి అభివృద్ధి పనులను నాడు–నేడు ఫేజ్–2బీ ద్వారా చేపట్టనున్నారు. ఇందుకు సుమారు రూ.9,15,19,524 నిధులు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. వీటితో ఆధునీకరణ పనులను గుర్తించి చేపడతారు. పాడైన భవనాలకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు వంటి పనులు చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలను పెయింటింగ్‌లతో ముస్తాబు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు.

**ఏజెన్సీలో 135 కేంద్రాలు**
ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 135 అంగన్‌వాడీ కేంద్రాలు సరికొత్త అందాలతో రూపుదిద్దుకోనున్నాయి. వీటి అభివృద్ధికి సుమారు రూ.1,15,75,000 నిధులు కేటాయించారు. దీంతో మారుమూల గ్రామాల్లోని కేంద్రాల్లో సైతం కొత్త సొబగులు సంతరించుకోనున్నాయి.

**మదర్స్ కమిటీ ద్వారా పనులు**
ప్రభుత్వం మంజూరు చేస్తున్న నాడు–నేడు ఫేజ్–2బీ పనులకు నిధులను మదర్స్ కమిటీ ద్వారా ఖర్చు చేయనున్నారు. ఈ కమిటీలో అంగన్‌వాడీ వర్కర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అలాగే సూపర్‌వైజర్, హెచ్‌ఎం, అంగన్‌వాడీ సెంటర్‌లో 2 నుంచి 5 ఏళ్లలో పేర్లు నమోదు చేసుకున్న ముగ్గురు తల్లులతోపాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారు. వీరి ద్వారానే పనులు చేపట్టనున్నారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేశాం**



జిల్లాలోని 1,012 అంగన్‌వాడీ పాఠశాలలు ఆధునీకరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నాడు–నేడు ఫేజ్–2బీలో అంగన్‌వాడీ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తాం. అంగన్‌వాడీ మదర్స్ కమిటీ ఆధ్వర్యంలోనే పనులు చేపడతాం.
– కేవీఏఎల్ పద్మావతి, ఐసీడీఎస్ పీడీ, ఏలూరు

**జాయింట్ ఖాతా ద్వారా నిధుల ఖర్చు**



ఆధునీకరణ పనులకు మదర్స్ కమిటీ సభ్యులతో నిధులు ఖర్చు చేయిస్తాం. ఇప్పటికే మదర్స్ కమిటీ పేరు మీద బ్యాంకుల్లో జాయింట్ ఖాతాలు తెరిపిస్తున్నాం. నిధులు నేరుగా వారి ఖాతాలోనే జమవుతున్నాయి. వారి పర్యవేక్షణలోనే పనులు జరుగుతాయి.
– ఈ.తులసి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీ, బుట్టాయగూడెం

## గవర్నర్ పర్యటనకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ లావణ్యవేణి

**దెందులూరు:** రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం దెందులూరు మండలం గాలాయగూడెంలో పర్యటిస్తారని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం గాలాయగూడెంలోని కృష్ణా కన్వెన్షన్ హాలును ఆమె పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 8.35 గంటలకు విజయవాడ రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10.55 గంటలకు గాలాయగూడేనికి గవర్నర్ చేరుకుంటారన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 వరకు ఇక్కడ కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 12.45 గంటలకు రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరతారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ తదితరులు హాజరుకానున్నారు.

**జిల్లా అధికారుల పరిశీలన**
కృష్ణా కన్వెన్షన్ హాలును ఎస్పీ డి.మేరీప్రశాంతి, జెడ్పీ సీఈఓ సుబ్బారావు, ఆర్డీఓ ఖాజావలీ, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు, సర్పంచ్ వెంకట సుబ్బారావు పరిశీలించారు.

## 17న సామాజిక బస్సు యాత్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**ద్వారకాతిరుమల:** దేవరపల్లిలో ఈనెల 17న జరుగనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో సోమవారం పార్టీ మండల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ)తో కలిసి ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధితో పాటు చేసిన మేలును ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. బడుగు, బలహీనవర్గాలకు చాలా మేలు జరుగుతుందని, వారందరినీ కలుపుకుని వెళ్లేందుకు ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. పార్టీ శ్రేణులంతా బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పెద్దెత్తున తరలిరావాలని కోరారు. ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటలకు దేవరపల్లిలోని కృష్ణంపాలెం బ్రిడ్జి వద్దకు అందరూ చేరుకోవాలని, అక్కడి నుంచి బైక్ ర్యాలీగా సభాస్థలికి వెళ్లాల్సి ఉందన్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాధికార బస్సు యాత్రకు మంచి స్పందన వస్తోందన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నోటాతో పోటీపడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీచేసినా ఏమీ ఉపయోగం ఉండదనే విషయం తెలంగాణ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమైందన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, యిమ్మడి నాగు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

## న్యాయవాదులకు అండగా 'లా నేస్తం'



న్యాయవాదులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ఏలూరు(మెట్రో):** యువ న్యాయవాదులకు అండగా ప్రభుత్వం వైఎస్సార్ లానేస్తం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం జూలై–డిసెంబర్ 2023కు సంబంధించి లా నేస్తం నిధుల విడుదల కార్యక్రమాన్ని వర్చువల్‌గా కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 82 మంది లబ్ధిదారులకు రూ.24.60 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు చెప్పారు. యువ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, ప్రాక్టీస్ సమయంలో ప్రోత్సాహకంగా ఈ నగదు ఉపయోగపడుతుందన్నారు. లా కోర్సు పూర్తి చేసిన యువ న్యాయవాదికి మూడేళ్లపాటు ఏడాదికి రూ.60 వేల చొప్పున రూ.1.80 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. లా నేస్తం తమకెంతో ఉపయోగపడుతుందని యువ న్యాయవాదులు తేజస్వి, విజయ్ రోహిత్, ప్రేమ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఏఓ రమాదేవి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

**నూజివీడు:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరవనం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించటం, ప్రకృతితో కలిసి జీవించటం మన జీవన విధానంలో భాగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మూడు ప్రదేశాలను పూర్తి చెట్లతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా నగరవనాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఏలూరు, నూజివీడులో ఇప్పటికే నగరవనాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులంతా ఉల్లాసంగా గడిపారు. జేసీ బి.లావణ్య వేణి, ఐటీడీఏ పీఓ సూర్యతేజ, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర దామా, సామజిక వనాల అధికారి హిమ శైలజ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 'జగనన్నకు చెబుదాం'తో సంతృప్తికర పరిష్కారం

**జేసీ లావణ్యవేణి**



నూజివీడులో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ లావణ్యవేణి, అధికారులు

**నూజివీడు:** జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌తో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలు రీఓపెన్ కానీ రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 248 దరఖాస్తులు అందాయన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జనసేన నాయకులతో కలిసి వరి కంకులు తీసుకువచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరగా, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని జేసీ స్పష్టం చేశారు.

**అర్జీల్లో కొన్ని..**
- తమ గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, డొంక పోరంబోకు స్థలం ఆక్రమణలు తొలగించాలని, శ్మశానానికి దారి కల్పించాలని నూజివీడు మండలం మొర్సపూడి సర్పంచ్ శెట్టిపల్లి హరిరామకృష్ణప్రసాద్ దరఖాస్తు అందజేశారు.
- నూజివీడు మండలం మిట్టగూడెంను రెవెన్యూ గ్రామంగా గుర్తించి సచివాలయం ఏర్పాటుచేయాలని కోరుతూ గ్రామస్తులు అర్జీ అందజేశారు.
- తన అసైన్డ్ భూమికి బీ ఫారం పట్టా మంజూరు చేయాలని ఆగిరిపల్లి మండలం నరసింగపాలెంకు చెందిన మందపాటి లక్ష్మి కోరారు.
- తనకు రైతుభరోసా–పీఎం కిసాన్ లబ్ధి మంజూరు కావడం లేదని–చింతలపూడి మండలం మల్లేశ్వరానికి చెందిన కొక్కుల సరస్వతి ఫిర్యాదు చేశారు.
- తన భూమి ఆక్రమణలకు గురైందని, న్యాయం చేయాలని ఆగిరిపల్లి మండలం నరసింగపాలెం చెందిన కోలాంటి ఏసేబు అభ్యర్థించారు.
- నూజివీడు నుంచి రాత్రి 7 గంటల తర్వాత విజయవాడకు నాన్‌స్టాప్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన దాకా సోమేశ్వరరావు కోరారు.

హౌసింగ్ పీడీ కె.రవికుమార్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో ఎస్ఈలు శ్రీనివాసరావు, సాల్మన్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, డ్వామా పీడీ రాము, డీఈఓ శ్యాంసుందర్, పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు, డీఎంహెచ్ఓ శర్మిష్ఠ, తహసీల్దార్ యల్లారావు పాల్గొన్నారు.

# పంచారామం.. భక్తి పరవశం



పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరునికి అభిషేకాలు



భీమవరంలో ఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు



పట్టిసం వీరేశ్వరస్వామికి పూజలు



పట్టిసంలో ఇసుకతిన్నెలపై క్యూ కట్టిన భక్తులు



పాలకొల్లు క్షీరారామంలో క్యూలైన్లలో భక్తులు

**పాలకొల్లు సెంట్రల్/భీమవరం(ప్రకాశం చౌక్):** జిల్లాలోని పంచారామక్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగాయి. కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం (క్షీరారామం), భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్ధన స్వామి ఆలయం (సోమారామం)కు భక్తులు పోటెత్తారు. పాలకొల్లులో మహన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకునే భక్తులతో ఆలయ వెనుక భాగం, అభిషేకాల మండపం నిండిపోయాయి. గోశాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి పంచారామ యాత్రికులతో ఆలయం మరింత కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించినట్టు అంచనా. స్థానిక రేపాక వారి సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. క్షీరారామలింగేశ్వస్వామి సేవా సమితి సభ్యులు ఉచిత పాలు, ప్రసాదం పంపిణీ చేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, పట్టణ సీఐ డి.రాంబాబు, ఎస్సైలు ఎస్.ముత్యాలరావు, బి.శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**సోమారామంలో ప్రత్యేక అభిషేకాలు**
భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానానికి వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. స్వామివారికి నిర్విరామంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకులు కందుకూరి సోంబాబు, చేకూరి రామకృష్ణ, అర్చకుల బృందం ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచమృతాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక నోములు నోచుకున్నారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థానం ఈఓ డి.రామకృష్ణరాజు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పట్టిసం.. భక్తజన సంద్రం**
**పోలవరం రూరల్:** పట్టిసం శివక్షేత్రంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి భక్తుల రద్దీ కనిపించింది. ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. శివకేశవులకు నిలయమైన ఈ క్షేత్రంలోని భావన నారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తులు గోదావరి దాటేందుకు లాంచీలు ఎక్కి, దిగేందుకు వీలుగా క్యూలైన్ల వద్ద పోలవరం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. మాసశివరాత్రి సందర్భంగా హుకుంపేట జమీందారు హోతా కుటుంబీకుల ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ చేశారు. ఆలయ ఈఓ ఎస్.సంగమేశ్వరశర్మ భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. శివక్షేత్రం రేవులో భక్తులకు సొసైటీ అధ్యక్షుడు పాదం రాజబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తెలగంశెట్టి సూర్యచంద్రం మజ్జిగ పంపిణీ చేశారు.

# పెళ్లింట పెను విపత్తు



గల్లంతైన గాయత్రీ, లక్ష్మీనారాయణ (ఫైల్)



అంతర్వేది బీచ్‌లో ఎదురు చూస్తున్న బంధువులు

- అంతర్వేది బీచ్‌లో స్నానానికి దిగి గల్లంతైన నవ వధూవరులు
- గుర్వాయిపాలెంలోని వధువు, కాళ్లకూరులోని వరుడి ఇళ్లలో కన్నీరుమున్నీరవుతున్న బంధువులు
- కొత్త దంపతుల జాడ కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

**కలిదిండి/కైకలూరు/కాళ్ల:** అగ్నిసాక్షిగా ఏడడుగులు వేసి ముచ్చటగా రెండు మాసాలు గడవలేదు. పెళ్లి పందిరి తోరణాలు కూడా వాడలేదు. అంతలోనే నవవధూవరులు సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. స్వామివారిని దర్శించుకుని తిరిగి ఇంటికి వస్తారని ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు నూతన జంట గల్లంతయ్యారనే సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనతో వధూవరుల ఇళ్లు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఏలూరు జిల్లా కలిదిండి మండలం గుర్వాయిపాలెం గ్రామానికి చెందిన అంబటి పరుశురామయ్య, ఉదయలక్ష్మీ మొదటి కుమార్తె గాయత్రీ (21)ని పశ్చిమగోదావరి జిల్లా జువ్వాలపాలెంకు చెందిన రేలంగి బసవలింగం, జయలక్ష్మీ కుమారుడు లక్ష్మీనారాయణ (26)తో నవంబర్ 1న కైకలూరు నియోజకవర్గం సింగరాయపాలెం గుడిలో ఘనంగా వివాహం జరిపించారు. లక్ష్మీనారాయణ బీటెక్, బీఈడీ చేసి భీమవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో కొత్త దంపతులు లక్ష్మీనారాయణ, గాయత్రీ ద్విచక్రవాహనంపై మధ్యాహ్నం 3 గంటలకు అంతర్వేది దేవాలయాన్ని దర్శించుకుని నాలుగు గంటలకు బీచ్‌కు వెళ్లారు. బంధువులతో కలిసి కాకుండా వాహనంపై బీచ్‌లో దూరంగా వెళ్లారు. అక్కడ వాహనం, సెల్‌ఫోన్లు ఉంచి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. తరువాత కొద్ది సమయానికే వీరు కనిపించలేదు. సెల్‌ఫోను ఆధారంగా బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్‌లో వరుడి తండ్రి బసవలింగం ఫిర్యాదు మేరకు పోలీసులు, మెరైన్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు వారి జాడ లేదు.

## క్లుప్తంగా

### మలేషియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 'విష్ణు' విద్యార్థినికి కాంస్యం



పిల్లి వందన

**భీమవరం:** మలేషియాలో సోమవారం జరిగిన ఏషియా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో 84 కిలోల సబ్ జూనియర్ విభాగంలో స్థానిక విష్ణు ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని పిల్లి వందన తృతీయస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. వెయిట్ లిఫ్టింగ్ తోపాటు వందన స్క్వాట్‌లో వెండి పతకం, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్‌లో కాంస్య పతకం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మెడల్స్ గెలిచిన వందనను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరాజు తదితరులు అభినందించారు.

### కళాశాల బస్సు ఢీకొని గేదెల కాపరి దుర్మరణం

**అత్తిలి:** గేదెలను మేత కోసం తోలుకునివెళుతుండగా ప్రైవేట్ కళాశాల బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఓ కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. అత్తిలి ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామానికి చెందిన బుంగా రామకృష్ణ (35) సోమవారం ఉదయం తణుకు వైపునకు గేదెలను మేత కోసం తోలువెళుతుండగా, అత్తిలి నుంచి తణుకు వెళుతున్న కళాశాల బస్సు అతివేగంగా వెనుక నుంచి రామకృష్ణను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే రామకృష్ణ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

### 13న త్రోబాల్ ఎంపిక పోటీలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో ఈ నెల 13న త్రో బాల్ జూనియర్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, సెక్రటరీ ఎన్.ఎం.శ్రీనాథ్ సోమవారం చెప్పారు. ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీలకు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలను, ఎనిమిది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. ప్రతిభ కనపర్చిన వారిని ఈ నెల 16, 17 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

## ● గడపగడపకు సంక్షేమం



**భీమడోలు:** గుండుగొలను బీసీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు బ్రోచర్ అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



**వేలేరుపాడు:** రామవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

# మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

- తిరుపతిలో మాస్టర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- 40 పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి మాస్టర్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

**ఏలూరు రూరల్:** రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ పతకాల పంట పండించారు. 30 ఏళ్ల వయస్సు విభాగం నుంచి 70 ప్లస్ వయస్సు వరకూ పోటీ పడి ప్రత్యర్థులను చిత్తు చేసి 40 మెడల్స్ చేజిక్కించుకున్నారు. ఇందులో 20 గోల్డ్ మెడల్స్, 16 సిల్వర్, మరో 4 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బీడీ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకూ చిత్తూరు జిల్లా తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీతో పాటు తారకరామ స్టేడియంలో రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న 75 ప్లస్ వయస్సు విభాగంలో ఎం.నరసింహరాజు 100, 200, 400, 4 x 400 మీటర్ల పరుగు పందెంలో 4 గోల్డ్ మెడల్స్, 4 x 100 పరుగు పోటీలో ఒక సిల్వర్ మెడల్స్ సాధించాడు. ఇదే విభాగంలో ఇంటి కృష్ణమోహనరావు హైజంప్‌లో గోల్డ్, 100, 800 మీటర్ల పరుగులో సిల్వర్, బ్రాంజ్ గెలుపొందారు. 70 ప్లస్‌లో ఎం.యోహాన్ షాట్‌పుట్, హేమర్‌త్రోలో 2 బ్రాంజ్‌మెడల్స్ చేజిక్కించుకున్నారు. 65 ప్లస్‌లో బీడీ నాగేశ్వరరావు హేమర్‌త్రో అంశంలో సిల్వర్ మెడల్ సాధించారు. 60 ఏళ్ల విభాగంలో సుంకర యాకోబు 800, 1400, 4 x 400, మూడు బంగారు పతకాలు, 5 కి.మీ పరుగు, 4 x 100 మీటర్ల పరుగులో 2 సిల్వర్ మెడల్స్ సాధించారు. మహిళలు 70 ప్లస్ విభాగంలో కె.శాంతకుమారి షాట్‌పుట్, డిస్కస్, జావలిన్‌త్రోలో 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. మరోపక్క పి.పద్మ జయలక్ష్మీ 40 ప్లస్ విభాగంలో పోటీపడి 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్‌లో 3 బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ఇదే క్రమంలో పి.రమేష్‌రాజు, పి.సుబ్బరాజు, జె.గోపాలకృష్ణ, వి.సుబ్బరాజు, వై.అశోక్‌కుమార్, ఎస్.సూర్యనారాయణ పలు విభాగాల్లో పోటీ పడి పతకాలు సాధించారని వివరించారు.

**అథ్లెటిక్స్‌లో మండపాక పీడీకి మూడు బంగారు పతకాలు**



బంగారు పతకాలతో పీడీ సూర్యనారాయణ

**తణుకు అర్బన్:** మండపాక జెడ్పీ హైస్కూల్ పీడీ సంకు సూర్యనారాయణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన 42వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 5 వేల మీటర్లు, 1500 మీటర్లు, 5 కిలో మీటర్లు వాకింగ్ పోటీల్లో పాల్గొని మూడు విభాగాల్లోనూ బంగారు పతకాలు సాధించినట్లు సూర్యనారాయణ సోమవారం స్థానిక విలేకరులకు చెప్పారు. ఈ విజయాలతో వచ్చే ఏడాది జనవరిలో పూణేలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను తణుకు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

## బాధితులకు సత్వర న్యాయం చేయాలి

స్పందనలో ఎస్పీ మేరీ ప్రశాంతి



స్పందనలో ఓ మహిళ సమస్య వింటున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

**ఏలూరు టౌన్:** ఏలూరు జిల్లాలో ఆయా సమస్యలపై స్పందనలో ఫిర్యాదులు, వినతులు సమర్పించిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఏలూరు ఎస్పీ డీ.మేరీప్రశాంతి ఆదేశించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆమె స్పందనలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి సంబంధిత పోలీస్ అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసిన నేపథ్యంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పే మోసగాళ్ల మాటలు నమ్మవద్దని కోరారు. ప్రతిభ ప్రామాణికంగా ఉద్యోగాలు సాధించాలని, అడ్డదారుల్లో వెళితే ఇబ్బందులు తప్పవని సూచించారు. ప్రతిభ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగావకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు.

**వినతుల్లో కొన్ని..**

తన భర్త ముందే వేరొక మహిళతో వివాహం అయిందని, తనను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని, తనను తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడని కలిదిండి నుంచి వచ్చిన ఓ మహిళ ఎస్పీకి మొరపెట్టుకుంది.

ఇళ్ళ స్థలాలు ఇప్పిస్తానని చెప్పి గ్రామ సర్పంచ్ ఒక్కొక్కరు నుంచి రూ.20 వేలు తీసుకుని మోసం చేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని పెదనిండ్రకొలను మహిళలు ఎస్పీని కోరారు. కళాశాలకు వెళ్లి చదువుకుంటున్న తన కుమార్తెకు ఓ వ్యక్తి మత్తు పదార్థాలు, మద్యం అలవాటు చేసి సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు తీసి సోషల్ మీడియా ప్రచారం చేస్తూ వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు మండలానికి చెందిన ఓ తల్లి అర్జీ అందించింది. తనకుమారుడు మరణించడంతో తన కోడలు ఇంటిని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో తనను ఇబ్బందులకు గురిచేస్తోందని, విచారణ చేసి న్యాయం చేయాలని జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన ఓ వృద్ధుడు అర్జీ అందించారు.

## పోలీసు స్పందనలో 13 ఫిర్యాదులు

**భీమవరం:** భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం 13 ఫిర్యాదులు అందాయని ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. ఈ ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. స్పందనలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

## ముగిసిన వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నీ

**విజయవాడ స్పోర్ట్స్:** సూరెడ్డి సత్యనారాయణ (నల్లబాబు) మెమోరియల్ వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. టోర్నమెంట్ విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. మహాత్మ కల్చరల్ ఫ్రెండ్స్ (ఎంసీఎఫ్) అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలకు విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా (ఎంసీఎఫ్), ప్రకాశం జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. విజేత జట్టు విశాఖపట్నం టోర్నీ ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. ఆదివారం రాత్రి హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా (ఎంసీఎఫ్) జట్టును ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో కృష్ణా జట్టు నిలిచింది. ప్రకాశం జట్టు మూడో స్థానాన్ని, తూర్పు గోదావరి జట్టు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. అర్జున, ద్రోణాచార్య అవార్డుల గ్రహీత ఎ.రమణరావు, ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), సిద్ధార్థ అకాడమి కోశాధికారి సూరెడ్డి సత్యనారాయణ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.బ్రహ్మాజీ, దయాకరరావు టోర్నీని పర్యవేక్షించారు.